



డీఎస్ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



డీఎస్ అంత్యక్రియల్లో పాల్గొన్న కుటుంబ సభ్యులు



పాడె మోస్తున్న ఎంపీ ధర్మపురి అర్వింద్



నివాళులర్పిస్తున్న వీహెచ్



... మండవ వెంకటేశ్వర్‌రావు



... మహేష్‌కుమార్‌గౌడ్



... లగడపాటి రాజగోపాల్



... నగర మేయర్ నీతూకిరణ్



... ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి



గాల్లోకి తూటాలు వదులుతున్న పోలీసులు



గౌరవ వందనం చేస్తూ..

డీఎస్‌కు అశ్రునివాళి

- జనహృదయ నేతకు ఘనవీడ్కోలు
- అశ్రునయనాలతో అంతిమ యాత్ర
- హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి, ముఖ్యనేతలు
- ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు
- జనసంద్రమైన నగరం

నిజామాబాద్ అర్బన్, జూన్ 30: జన హృదయ నేత, పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్‌కు ప్రజలు అశృన యనాలతో అశ్రునయనాలతో వీడ్కోలు పలికారు. నగరంలోని బైపాస్ రోడ్డులో గల ఆయన వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం ప్రభుత్వ లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన పెద్దకుమారుడు ధర్మపురి సంజయ్ అంతిమ సంస్కారాలను నిర్వహించగా ఆయన రెండో కుమారుడు, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ సైతం పాల్గొన్నారు. అంతకుముందు ప్రగతినగర్‌లోని డీఎస్ నివాసంలో ఉంచిన డి.శ్రీనివాస్ పార్థివదేహానికి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, సీఎం సలహాదారు వేంనరేందర్‌రెడ్డి, తదితరులు నివాళులర్పించారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ కలిగిన నేత డీఎస్ అని, ధర్మపురి శ్రీనివాస్ మరణంతో కాంగ్రెస్ పార్టీ ఒక నిబద్ధతత గల నాయకుడిని కోల్పోయిందని పేర్కొన్నారు. అనంతరం అంతిమయాత్ర డీఎస్ నివాసం నుంచి ఎల్లమ్మగుట్ట చౌరస్తా, ఎన్టీఆర్ చౌరస్తా, రైల్వేకమాన్, కంఠేశ్వర్ మీదుగా బైపాస్ రో డ్డులోని వ్యవసాయ క్షేత్రం వరకు సాగింది. అంతిమయాత్రలో డీఎస్ అభిమానులు, శ్రేయోభిలాషులు, కాంగ్రెస్, బీజేపీ శ్రేణులు, ప్రజలు వేలాదిగా పాల్గొన్నారు. దీంతో నగరంలోని ప్రధాన రహదారులన్నీ జనసంద్రమయ్యాయి. సుమారు 3 గంటల పాటు అంతిమయాత్ర సాగింది.

అంతిమయాత్రలో 'డి.శ్రీనివాస్ అమర్ హై.. శీనన్న అమర్ హై' అంటూ అభిమానులు నినాదాలు చేశారు. అంతిమ సంస్కారాలకు ముందు ప్రభుత్వ లాంఛనాలతో పోలీసులు నివాళులర్పించారు. గాలిలోకి కాల్పులు జరిపి శ్రద్ధాంజలి ఘటించారు. అంతిమయాత్రలో ముఖ్యనేతలు మధుయాష్కి, సుదర్శన్‌రెడ్డి, మహేష్‌కుమార్‌గౌడ్, జీవన్‌రెడ్డి, మాజీ మంత్రులు మండవ, నేరేళ్ల ఆంజనేయులు, మాజీ ఎంపీలు వి.హన్మంత్‌రావు, లగడపాటి రాజగోపాల్, మర్రి శశిధర్‌రెడ్డి, ఈటల రాజేందర్, వివేక్, తాహెర్‌బిన్ హందాన్, మానాల మోహన్‌రెడ్డి, కేశవేణు, రత్నాకర్, అరికెల నర్సారెడ్డి, ఆకుల లలిత, నగర మేయర్ నీతూకిరణ్, గడుగు గంగాధర్, నగేష్‌రెడ్డి పాల్గొన్నారు. బీజేపీ నాయకులు ప్రేమేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రాకేష్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యేలు యెండల లక్ష్మీనారాయణ, ఈరవత్రి అనిల్, ఏనుగు రవీందర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, బిగాల గణేష్‌గుప్త, సీపీఐ, సీపీఎం నాయకులు రమేష్‌బాబు, నూర్జహాన్, పెద్దివెంకట్రాములు, సుధాకర్, భూమయ్య, వి.ప్రభాకర్ డీఎస్ నివాసంలో నివాళులర్పించారు.

ఏఐసీసీ దూతగా వచ్చిన ఎంపీ సురేష్

కాంగ్రెస్ సీనియర్ నేత డీఎస్ మరణంపై ఏఐసీసీ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. పార్లమెంట్ సెషన్స్‌తో యువనేత రాహుల్‌గాంధీ, అనారోగ్య కారణాలతో సోనియాగాంధీ డీఎస్ అంతిమయాత్రలో పాల్గొనలేక పోయి నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఏఐసీసీ దూతగా ఇండియా కూటమి అభ్యర్థిగా లోక్ సభ స్పీకర్‌గా పోటీ చేసిన కేరళకు చెందిన సీనియర్ ఎంపీ సురేష్‌ను నిజామాబాద్‌కు పంపించింది. ఈమేరకు ఆయన డీఎస్‌పార్థివదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులతో మాట్లాడారు.



డీఎస్ నివాసం వద్ద పోలీసుల బందోబస్తు

అంతిమయాత్రలో అధికార యంత్రాంగం

రాష్ట్రప్రభుత్వం ప్రభుత్వ లాంఛనాలతో డి.శ్రీనివాస్ అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయించిన ప్రకారం అంతిమయాత్రలో జిల్లాకు చెందిన అధికార యంత్రాంగం పాల్గొంది. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, ఐజీ సుధీర్ బాబు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్ మకరంద్, ఏర్పాట్లను పర్యవేక్షించారు. వ్యవసాయ క్షేత్రం వద్ద అంత్యక్రియలకు అన్నిఏర్పాట్లు చేశారు. పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.



మీడియాతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

నగరానికి సీఎం పర్యటన ఇలా..

ఖిల్లా, జూన్ 30: మాజీ పీసీసీ అధ్యక్షుడు, మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ అంత్యక్రియల్లో పాల్గొనడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటనకు ఆదివారం వచ్చారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా ఉదయం 11.25 గంటలకు సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి కాన్వాయ్ ద్వారా బయలుదేరి ప్రగతినగర్‌లో గల డీఎస్ ఇంటికి చేరుకున్నారు. అక్కడి నుంచి తిరిగి 11.50 గంటలకు బయల్దేరి హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. ఆయన పర్యటిస్తున్న రోడ్డుమార్గంలో సుమారు 300 మంది పోలీసులతో భారీ బందోబస్త్‌ను పోలీసుశాఖ ఏర్పాటు చేసింది. అడుగడుగునా దారులకు బారికెడ్లను ఏర్పాటు చేసి ప్రతీ బారికెడ్ల వద్ద పోలీసలను నియమించారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య సీఎం పర్యటన ముగిసింది.

నేటి నుంచే.. కొత్త చట్టాల అమలు

- నెలరోజులుగా సిబ్బందికి శిక్షణ
- నేరాలు తగ్గే అవకాశాలు
- బాధితులకు సత్వర న్యాయం



ఖిల్లా,జూన్30: నేరాల సంఖ్యను తగ్గించేందుకు, బాధితులకు సత్వర న్యాయం జరిగేందుకు కొత్త చట్టాలను జూలై 1 నుంచి పోలీసుశాఖ అమలు చేయనుంది. అందుకోసం పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తున్న సుమారు 1040 మందికి కొత్త చట్టాలపై శిక్షణ ఇచ్చారు. ఇటీవల మారిన సాంకేతికత, డిజిటల్ విధానాలు పెరుగడంతో బాధితులకు న్యాయం సకాలంలో అందకుండా పోతోంది. ముద్దాయిలు ఆర్థిక లావాదేవిల నేరాలు చేసి చట్టం పరిధి నుంచి తప్పించుకునే అవకాశాలు ఉండేవి. దీంతో బాధితులకు న్యాయం జరుగకపోయేది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ముఖ్యంగా బాధితులకు సత్వర న్యాయం జరిగేలా మూడుచట్టాల్లో మార్పులు చేశారు. వాటితో బాధితులకు న్యాయం జరుగుతుందని పోలీసుశాఖ, న్యాయశాఖ నమ్ముతోంది. పైగా న్యాయస్థానంలో వాయిదాలపై వాయిదాలు వేయడం వల్ల బాధితులు రోజుల తరబడి కోర్టు చుట్టూ తిరగడం వల్ల ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా సమయం వృధా అయ్యి న్యాయం జరుగడానికి వేచి ఉండాల్సిన పరిస్థితులు కలిగేవి. దీనిని దృష్టిలో ఉంచుకుని గతంలో ఉన్న చట్టాల్లో మార్పులు తీసుకొచ్చారు. ఐసీపీ చట్టం స్థానంలో భారతీయ న్యాయ సంవిధాన్, క్రిమినల్ ప్రొసిజర్ కోడ్ స్థానంలో భారతీయ న్యాయ సురక్ష నాగరికతగా, ఐఈఏ చట్టం స్థానంలో బీ ఎస్‌ఏ భారతీయ సాక్ష్య ఆధీన్‌లు మార్పులు చేశారు. దీంతో మోసపోయిన వారికి న్యాయంతోపాటు మోసాలు చేసే వారికి శిక్షలను పెంచారు. చాలా కేసుల్లో నిందితులు తప్పించుకునే అవకాశాలను తగ్గించడం వల్ల నేరాల సంఖ్య తగ్గుతుందని పోలీసు, న్యాయశాఖ భావిస్తోంది. గతంలో ఆర్థిక లావాదేవీల్లో మోసాలకు గురయిన బాధితుల ఆస్తులను పోగొట్టుకునేవారు. కానీ ప్రస్తుతం ఈ చట్టాల వల్ల బాధితులకు సత్వర న్యాయంతో పాటు మోసపోయిన ఆస్తులను ఈ చట్టం ద్వారా స్వాధీనం చేసుకుని వాటిని అమ్మి బాధితుడికి ఇచ్చే అవకాశాలు కలుగుతున్నాయి. ఈ చట్టం అమలు రావడంతో నేరాలు చేసే వారు మోసాలు చేయడానికి భయపడేలా రూపసొందించడం జరిగిందని పోలీసుశాఖ తెలిపింది. నేరాల సంఖ్య తగ్గడం వల్ల పోలీసుశాఖకు ప్రాధాన్యత కలిగే అవకాశాలు ఉంటాయి.

బాధితులకు అవగాహన సదస్సులు

మారిన కొత్త చట్టాల గురించి బాధితులకు వివరించడానికి జిల్లా లీగల్ అథారిటీ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులను ఏర్పాటు చేయనుంది. అవగాహన సదస్సుల ద్వారా ప్రజలకు న్యాయం జరుగడానికి వీలుగా వివరించడం జరుగుతోంది. మారిన చట్టాలను ప్రజలకు వివరించడానికి న్యాయసేవాధికార సంస్థ పూర్తి బాధ్యత తీసుకుని అమలుతీరును వివరిస్తుంది.

బదిలీ ఉత్తర్వుల కోసం ఉద్యోగుల ఎదురుచూపులు!



- ప్రభుత్వం నుంచి వెలువడగానే ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయత్నాలు
- రెండు మూడు రోజుల్లో బదిలీలపై ఉత్తర్వులు వెలువడే అవకాశం
- 33 శాతం మందికి బదిలీల్లో అవకాశం

నిజామాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉద్యోగుల బదిలీలు పెద్దఎత్తున జరుగనున్నాయి. ఇప్పటికే ఉపాధ్యాయుల బదిలీలను చేపట్టిన ప్రభుత్వం అన్నిశాఖల్లోనూ ఉద్యోగుల బదిలీలను చేయనుండటంతో జిల్లాలో పనిచేస్తున్న వారు ఉత్తర్వుల కోసం ఎదురు చూస్తున్నారు. బదిలీల ఆదేశాలు వెలువడగానే దరఖాస్తు చేయడంతోపాటు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. మూడేళ్ల సర్వీస్ దాటిన ఉద్యోగులను బదిలీ చేయనుండటంతో వారు ప్రయత్నాల్లో ఉన్నారు. ఈ బదిలీల్లో 33శాతానికి అవకాశం ఉండటంతో తమకు నచ్చిన ప్రదేశాలకు వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నారు. దీర్ఘకాలికంగా పనిచేస్తున్న వారికి అవకాశం ఇవ్వనుండటంతో తమ సర్వీసు రికార్డులపైన దృష్టి పెట్టి ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. బదిలీకలు సంబంధించి ప్రభుత్వం రెండు మూడు రోజుల్లో నిర్ణయం తీసుకొని ఉత్తర్వులను ఇవ్వనుండటంతో శాఖల వారిగా ఉద్యోగులు వేచి చూస్తున్నారు. కొంతమంది జోన్‌లతో ఇతర ప్రాంతాలకు బదిలీ కావడంతో ప్రభుత్వం ఇచ్చే ఉత్తర్వుల ఆధారంగా సొంత జిల్లాలకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ధరణి సమస్యలపై దృష్టి పెట్టిన ప్రభుత్వం రెవెన్యూ మినహా మిగతా ప్రభుత్వ శాఖల్లోనూ ఉద్యోగులందరిని బదిలీ చేయనుండటంతో ఎక్కువ మొత్తంలో అవకాశం రానుండటం వల్ల ఉద్యోగులు ఈ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు.

ఉద్యోగుల బదిలీల దృష్టి

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలపై నజర్ పెట్టింది. ఇప్పటికే ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించడంతో పాటు వారిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేసింది. ఎస్జిటిలను కూడా బదిలీ చేసేందుకు అధికారులు సీనియారిటీలను తీస్తున్నారు. వాటికి అనుగుణంగా బదిలీ చేసేందుకు లిస్టు ఖరారు చేస్తున్నారు. విద్యాశాఖ లాగానే ప్రభుత్వంలోని అన్నిశాఖల ఉద్యోగులను బదిలీ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఉద్యోగ సంఘాల నేత విజ్ఞప్తి మేరకు ఈ బదిలీలను చేపట్టేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది. రెండుమూడు రోజుల్లోనే ప్రభుత్వం నిర్ణయం తీసుకొని బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులను శాఖల వారిగా వెలువర్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ప్రభుత్వం ఇచ్చే ఆదేశాలకు అనుగుణంగా ఉన్న ఉద్యోగుల్లో 33శాతం మందికి అవకాశం కల్పించనున్నారు. దీర్ఘకాలికంగా ఒకేచోట పనిచేస్తున్న వారితోపాటు మూడేళ్లకు పైబడి పనిచేస్తున్న వారిని ఈ బదిలీలో ఇతర ప్రాంతాలకు చేయనున్నారు. వీరితో పాటు అనారోగ్య సమస్యలు ఉన్నవారు కూడా ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేయగానే జిల్లాలోని అన్నిశాఖల పరిధిలో అటెండర్ నుంచి అధికారుల వరకు బదిలీ కానున్నారు. ప్రతీశాఖలో పనిచేస్తున్న జూనియర్, సీనియర్ అసిస్టెంట్లతో పాటు సూపరింటెండెంట్లు, అధికారులకు ఈ బదిలీల్లో అవకాశం ఇవ్వనున్నారు. కొంతమంది కొత్తజిల్లాలు ఏర్పాటు చేసినప్పుడు అవసరం నిమిత్తం బదిలీ చేశారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న వారు ప్రస్తుతం ఇతర జోన్‌పరిధిలోకి వెళ్లారు. వారు సొంత జిల్లాకు వచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ప్రభుత్వం ఉత్తర్వులు వెలువర్చగానే అన్నిశాఖల్లో ఉద్యోగుల సీనియారిటీని పరిశీలిస్తారు. ఆయా శాఖల పరిధిలో మూడేళ్లకు పైబడి పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలను తీసుకుంటారు. సీనియారిటీ ఆధారంగా నోటిపై చేస్తారు. దీర్ఘకాలికంగా ఒకేచోట పనిచేసేవారికి మొదట అవకాశాన్ని కల్పిస్తారు. ఆ తర్వాత మూడేళ్లకు పైబడి పనిచేసిన వారికి ఈ బదిలీల్లో అవకాశం ఇస్తారు. వీరితో పాటు దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉన్నవారికి బదిలీకి అవకాశం కల్పిస్తారు. కొంత మంది ఉద్యోగులకు సంవత్సరంలోపే సర్వీస్ ఉంటే వారిని బదిలీ చేయరు. ప్రస్తుతం పనిచేస్తున్న కార్యాలయాల్లోనే కొనసాగిస్తారు. అన్నిఅంశాలను పరిశీలించిన మీదట ఉద్యోగులు ఇచ్చే ఆప్షన్లను బట్టి బదిలీలను కొనసాగిస్తారు. ఆయా శాఖలో ఉన్న ఉద్యోగుల సంఖ్యను బట్టి ఈ బదిలీలను చేస్తారు. కొన్నిశాఖల పరిధిలో ఉద్యోగులు ఎక్కువ కాలం పనిచేస్తున్న ఖాళీలు ఎక్కువగా ఉండటం, కొత్తవారిని భర్తీ చేయకపోవడం వల్ల వారు దీర్ఘకాలికంగా అదే కార్యాలయంలో చేస్తున్నారు. వేరే ఉద్యోగులను కార్యాలయంలోకి బదిలీచేసిన రాకపోవడం వల్ల వారు కొనసాగుతున్నారు. తమ శాఖల జిల్లా స్థాయి అధికారులతో పాటు ఉన్నతాధికారులను కలుస్తూ ఉత్తర్వులకు అనుగుణంగా అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

బదిలీల కోసం సిఫారసులు!

కొంతమంది ఉద్యోగులు నేతల ద్వారా సిఫారసులను చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. మరికొంతమంది ఉద్యోగ సంఘాల నేతల ద్వారా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. బదిలీ ఉత్తర్వులు వెలువడగానే తమకు నచ్చిన డివిజన్లతోపాటు ఇతర జిల్లాలకు వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నారు. ఎన్నికల సమయంలో ఇతర జిల్లాలకు బదిలీ అయిన అధికారులు కూడా జిల్లాకు వచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారు. బదిలీ ఉత్తర్వులోనిఆ నిబంధనల ప్రకారమే అవకాశం ఉంటుందని నేతలు చెప్తున్నారు. ప్రయత్నాలు చేసినా ఖాళీలను బట్టి 33శాతం లోపే బదిలీలకు అవకాశం ఉంటుందని, అందరికీ అవకాశం ఉండదని చెప్తున్నారు. మొత్తంగా ఉద్యోగులు మాత్రం ప్రభుత్వ ఉత్తర్వుల కోసం ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. బదిలీల్లో ఉత్తర్వులు వెలువడిన తర్వాత ఎంతమంది ఏ ప్రాంతాలకు వెళ్లనున్నారో తేలనుంది.

ఊపందుకున్న వరినాట్లు



నాట్లు వేస్తున్న రైతులు



భీమ్‌గల్ రూరల్, జూన్30: ఖరీఫ్ ప్రారంభమై నెల రోజులు కావస్తోంది. ఖరీఫ్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు సమృద్ధిగా వర్షాలు కురవలేదు. ఆశించిన స్థాయిలో వర్షాలు లేనప్పటికి రైతులు ముందుగానే వరినాళ్లు పోసుకుని నాటడానికి సిద్ధంగా వుంచుకున్నారు. బోరుబావుల కింద రైతులు భీమ్‌గల్ మండలంలో ఇప్పటికే సాగు పనిలో నిమగ్నమయ్యారు. వరినాళ్లు నాటడానికి సిద్ధంగా ఉండడంతో రైతులు వరినాట్లే పనుల్లో బిజీ అయ్యారు. భీమ్‌గల్ మండలంలోని బెజ్జోర, బడాభీమ్‌గల్, గోన్‌గొప్పుల, బాచన్‌పల్లి, మెండోరా, బాబాపూర్ గ్రామాలలో వరినాట్లు జోరందుకున్నాయి. బీహార్ కూలీలు వరినాటే పనుల్లో ఉదయం నుంచే బిజీ అయ్యారు. వర్షాలు సంవృద్ధిగా కురిస్తే భూగర్భ జలాలు పెరిగి సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలు వున్నాయి. ప్రస్తుతం బోరుబావుల కింద మాత్రమే వరి నాట్లు మొదలయ్యాయి. జూలై చివరి నాటికి వరినాట్లు పూర్తి అవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

ప్రమాదకరంగా మూలమలుపులు


రోడ్డు పక్కన సెప్టీవాల్


అంకాపూర్ శివారులో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

ఆర్మూర్‌రూరల్, జూన్30: ఆర్మూర్ ప్రాంతంలోని వివిధ గ్రామాలలో మూలమలుపులు ప్రమాదకరంగా తయారయ్యాయి. ఆర్మూర్ మండలం ఇస్సాపల్లి నుంచి అంకాపూర్ వెళ్లే మార్గంలో ఉన్న మూలమలుపులతో అజాగ్రత్తగా వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇస్సాపల్లి వైపు నుంచి రైతులు తాము పండించే పంటలను అంకాపూర్ మార్కెట్‌కు ఇదే రోడ్డు గుండ తీసుకువెళ్తుంటారు. ఇదీ సమీపదారి కావడంతో తరచు ఈ మార్గం గుండానే ప్రయాణం చేస్తుంటారు. అంతేగాకుండా తమ గ్రామశివారులోని వ్యవసాయ క్షేత్రాలకు నిత్యం వెళ్తుంటారు. రెండు గ్రామాల మధ్య తారురోడ్డు కొత్తగా వేసినప్పటికీ మూల మలుపులను సరి చేయకపోవడంతో ప్రమాదకరంగా ఉన్నాయి. వీటికి తోడు రోడ్లకు ఇరువైపులా చెట్లు పెరిగి ఎదురుగా వచ్చే వాహనాలు కనబడకుండా పోయే అవకాశం ఉంది. అదే విధంగా ఈ దారి వెంబడి రోడ్ల పక్కన వ్యవసాయ బావులు సైతం ఉన్నాయి. బావుల వద్ద చిన్నపాటి సూచికబోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ వాహనదారులు జాగ్రత్తగా వెళ్లాల్సి వస్తోంది. అలాగే కొంత మేర రోడ్డు దిగువన ఉండడంతో వర్షాకాలంలో గుత్పనీరు విడుదల చేసే సమయంలో రాకపోకలకు ఇబ్బందిగా మారుతుంది. మూలమలుపులు ఉన్న చోట ఆర్అండ్‌బీ శాఖ అధికారులు స్పీడ్ బ్రేకర్‌లు ఏర్పాటు చేయిస్తే ప్రజలను ప్రమాదబారి నుంచి కాపాడినవారవుతారు. రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న చోట సెఫ్టీవాల్స్ ఏర్పాటు చేస్తే ప్రజలకు రక్షణగా ఉంటుంది. దీంతో పాటు మండలంలోని చేపూర్,లక్కోర గ్రామాల్లో శివారులోని జాతీయరహదారిపై సైతం మూలమలుపు వద్ద తరచుప్రమాదాలు జరుగుతుంటాయి. ఆర్మూర్ నుంచి పిప్రికి వెళ్లే మార్గంలో ప్రభుత్వ కళాశాల మూలమలుపు ప్రమాద కరంగా తయారైంది. ఈ స్థలంలో గతంలో పలుమార్లు ప్రమాదాలు జరి గాయి.

● సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి

రోడ్ల మూలమలుపుల వద్ద సూచికబోర్డులు ఏర్పాటు చేయిస్తే ప్రమాదాలు జరుగకుండా కొంత మేరకైన నివారించవచ్చు. ప్రమాదకరమైన మూలమలుపులు ఉన్నాయని గుర్తు చేస్తూ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. దీని ద్వారా వాహనదారులు వాహ నాలు నడిపే సమయంలో జాగ్రత్తలు తీసుకుంటారు.

స్పీడ్ బ్రేకర్‌లు ఏర్పాటు చేయాలి



ఇస్సాపల్లి - అంకాపూర్ గ్రామాల మధ్య మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. గతంలో పలుమార్లు ప్రమాదాలు జరిగి పలువురు గాయాల బారినపడ్డారు. సంబంధిత అధికారులు స్పీడ్ బ్రేకర్‌లు ఏర్పాటు చేయాలి. అదే విధంగా కొన్ని చోట్ల సెఫ్టీవాల్స్ నిర్మిస్తే ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు అధికారులు కృషి చేయాలి.

- తంబురి శ్రీనివాస్, ఇస్సాపల్లి

మోతెలో పరిష్కారమైన భూ వివాదం

● నాలుగేళ్లుగా రగులుతున్న సమస్య
● దళిత కుటుంబానికి దక్కిన న్యాయం



మోతెలో పరిష్కారమైన స్థలం ఇదే

వేల్పూర్, జూన్30: మండలం మోతె గ్రామంలో సుమారు నాలు గేళ్లగా రగులుతున్న భూవివాదం ఇటీవల ఎట్టకేలకు పరిష్కరమైంది. దీంతో భూమి కోసం పోరాడుతున్న దళిత కుటుంబం, రెవెన్యూ, పోలీసు విభాగాలు, గ్రామస్థులు ఊపిరిపీల్చుకున్నారు. వివరాల్లోకి వెళ్తితే మో తె గ్రామంలోని రాజరాజేశ్వర దేవాలయం భూమి పక్కన సర్వేనెంబర్ 333లో ఎకరం 20గుంటల భూమి 1962నుంచి ఇస్సాపల్లి గంగారాం, ఇస్సాపల్లి నడ్పి గంగారాం అనే వ్యక్తుల పేర్లపై రికార్డుల్లో నమోదై ఉంది. అప్పట్లో ఈ భూమిని ఇస్సాపల్లి గంగారాం, రాజరాజేశ్వరస్వామికి ఇచ్చారని, దేవాలయానికి ఇచ్చిన భూమిపై ఎవరు అబద్ధం ఆడరు అనే నమ్మకంతో పేరు మార్పించి చేయించలేదని గ్రామస్థులు పేర్కొన్నారు. మాతాత ఆ భూమిని దేవాలయానికి ఇవ్వలేదని, రికార్డు ప్రకారం భూమి తమదేనని ఇస్సాపల్లి గంగారాం మనవడు ఇస్సాపల్లి రవి గ్రామస్థులకు తెలిపారు. దీంతో గ్రామస్థులు భూమికి, ఏర్పాటు చేసిన పెన్సింగ్‌ను నాలుగు సార్లు తొలగించి హద్దురాళ్లను పగులగొట్టారు. అడ్డుకోబోయిన రవి కుటుంబ సభ్యులపై గ్రామస్థులు దాడి చేశారు. రవి కుటుంబానికి సాంఘీక బహి ష్కరణ విధించారు. రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి భూమి ఇస్సాపల్లి గంగారాం వారసులకు చెందుతుందని తెల్చిచెప్పారు. అయినప్ప టికీ గ్రామస్థులు ఆ భూమి దేవాలయానిదేనని పట్టుబట్టారు. గ్రామస్థులు చేసిన దాడిపై ఇస్సాపల్లి రవి 2003లో ఎస్పీకి అట్రాసిటి కేసు నమోదు చేశారు. గత ఏడాది సీపీగా బాధ్యతలు చేపట్టిన కల్మేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పి ఆదేశాలు జారీ చేశారు. దీంతో పోలీసులు సైతం గ్రామస్థులకు చాలా సార్లు కౌన్సిలింగ్ నిర్వహించారు. చట్టా ప్రకారం ఇస్సాపల్లి గంగారాంకు చెందిన ఎకరం 20గుంటల భూమి వారి వారసులకే చెందుతుందని గ్రామస్థులకు ఎటువంటి హక్కులేదని, దానిపై ఏటువంటి అజామాయిషి చేసిన కేసులు నమోదు అవుతాయని నచ్చజెప్పారు. అయినప్పటికీ గ్రామస్థులు గత బుధవారం తిరిగి దాడి చేసి ఇస్సాపల్లి గంగారాం భూమికి పాతిన సరిహద్దులను పెన్సింగ్‌ను తొలగించి వేశారు. ఈ విషయాన్ని గంగారాం కుటుంబీకులకు వేల్పూర్ పోలీసులు తెలపడంతో పోలీసులు మోతె గ్రామస్థులను పిలిపించి చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నందుకు రిమాండ్‌కు చెల్లాల్సిందేనని స్పష్టం చేశారు. దాంతో గ్రామస్థులు తమ నిర్ణయాన్ని మార్చుకొని ఇక నుంచి ఆ భూమి జోలికి వెళ్లబోమని గంగారాం కుటుంబీకులకు రాతపూర్వకంగా రాసిచ్చారు. గంగారాం కుటుంబీకులు సైతం దేవాలయానికి తమవంతుగా 24గుంటల భూమిని విరాళంగా రాసిచ్చారు. దీంతో గత నాలుగేళ్లుగా రగులుతున్న భూ వివాదం పరిష్కా రం కావడంతో ఇటు అధికారులు, అటు గ్రామస్థులు ఊపిరిపీల్చుకున్నారు.

ప్రమాదకరంగా ఉన్న గుంత పూడ్చాలి


గుంతవు చూపుతున్న దృశ్యం

కోటగిరి,జూన్30:కోటగిరి మండల కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల పక్కన ప్రమాదకరంగా ఉన్న గుంతను పూడ్చాలని సీపీఎం కార్యదర్శి నన్నేసాబ్ డిమాండ్ చేశారు. కోటగిరి మైనారిటీ పాఠశాల ప్రాంగణంలో గుంతను ఆదివారం సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 7కోట్ల వ్యయంతో పాఠశాల నిర్మించినప్పటికి గుంత పూడ్చకపోవడం సరికాదన్నారు. పాఠశాలలో 350మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. మైదానం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం గుంతను పూడ్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు తదితరులున్నారు.

ఆర్మూర్‌లో ఘనంగా ఊరపండుగ

ఆర్మూర్‌రూరల్, జూన్30: ఆర్మూర్ పట్టణంలో సర్వసమాజ్, ఆరు పంతల ఆధ్వర్యంలో ఆదివారం ఊరపండగను ఘనంగా నిర్వహించారు. ఆర్మూర్ పట్టణంలోని వివిధ ఆలయాల్లో గ్రామదేవతలకు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పడిపంటలతో విలజిల్లాలని, ప్రజలందరికి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్వసమాజ్ అధ్యక్షుడు ఆకుల రాజు, కోశాధికారులు గుండెటి మహేష్, చిట్టి శ్రీనివాస్, సభ్యులు దోమకొండ రాజు, గోపాల్, నల్ల లింగన్న, సిద్ధపురం లింగన్న, వివిధ సంఘాల పెద్దమనుషులు పాల్గొన్నారు.

బోధన్ వాసికి మహానంది జాతీయ పురస్కారం

బోధన్‌రూరల్,జూన్30: తెలుగు, వెలుగు సాహితి వేదిక జాతీయ స్వచ్ఛంద సేవ సమితి ఆధ్వర్యంలో మాజీ భారత ప్రధాని, భారత రత్న పీవీ నరసింహ రావు జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన మహనంది జాతీయ పురస్కారాలలో బోధన్ మండలం ఏరాజ్‌పల్లి గ్రామానికి చెందిన కుర్రోళ్ల లక్ష్మి జానపద రంగంలో చేస్తున్న విశిష్టమైన సేవలకు తెలుగు, వెలుగు మహనంది జాతీయ పురస్కారం అందుకున్నారని స్వచ్ఛంద సేవ సంస్థ జాతీయ చైర్మన్ పాలోజి రాజ్‌కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోహన్ రావు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో కుర్రోళ్ల లక్ష్మికి మహనంది జాతీయ పురస్కారాన్ని అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, పాల్గొన్నారు.

జిల్లా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడికి పలువురి పరామర్శ

ఏర్గట్ల, జూన్ 30: కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్ చిన్న తండ్రి శివన్నోల్ల శంకర్ ఇటీవలే మృతి చెందగా ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, మాజీ విప్ ఈరవత్రి అనిల్‌ను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సోమ దేవ రెడ్డి, ఆడెపు గంగాప్రసాద్, పెద్దిరెడ్డి రవి, మాజీ ఎంపిటీసిలు గడ్డం లింగారెడ్డి, సున్నపు అంజయ్య, తుపాకుల శ్రీనివాస్ గౌడ్, సుంకేట రవిలు పాల్గొన్నారు.

వర్నిలో భారీ వర్షం

వర్ని,జూన్30: వర్ని, చందూర్ మండలాల పరిధిలో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా సుమారు రెండు సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు తహసీల్దార్ సాయిలు తెలిపారు. నిజాంసాగర్ నీటి విడుదలతో పాటు భారీ వర్షం కురవడంతో చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. పంట పొలాలు జలమయం అయ్యాయి.

బోధన్‌లో ఘనంగా బోనాల పండుగ

బోధన్‌రూరల్,జూన్30: బోధన్‌లో ఆదివారం మున్నూరు కాపు, యాదవ సంఘం, తదితర కుల సంఘాల ఆధ్వర్యంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల నుండి ఊరేగింపుగా బోనాలతో మహిళలు మహలక్ష్మి ఆలయానికి చేరుకున్నారు. డప్పుచప్పుళ్ల వాయిద్యాల మధ్య బోనాలను సమర్పించారు. అమ్మవారికి ఓడి బియ్యం నింపి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం నాయకులు బీర్కూర్ బుజ్జి, గాండ్ల తేలికుల సంఘం అధ్యక్షులు నాగేశ్వర్ రావు, హన్మాండ్లు, శివయ్య, సురేష్, టీచర్ సాయిలు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య

నవీపేట,జూన్30: మండలంలోని జన్నేపల్లికి చెందిన సుద్దపల్లి చందన్న(47)అనే వ్యక్తి ఆదివారం తెల్లవారుజామున తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. నందిపేట మండలం సిద్దాపూర్‌కు చెందిన చందన్న గత కొన్ని సంవత్సరాలుగా తన కుటుంబ సభ్యులతో కలిసి జన్నేపల్లిలో నివాసం ఉంటూ చేపలు పడుతూ జీవిస్తున్నాడు. శనివారం రాత్రి కుటుంబ సమస్యలతో భార్యభర్తల మధ్య గొడవ జరుగగా తెల్లవారుజామున అతడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య గంగామణి, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇదిలా ఉండగా చందన్న మృతిపై తమకు అనుమానం ఉందని మృతుడికి వరుసకు సోదరుడు అయ్యే సాయిలు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి ఒంటిపై ఎటువంటి గాయలు లేవని ఎస్ఐ పేర్కొన్నారు.

రుద్రూరులో శునకాల బెడద

- ద్విచక్ర వాహనదారులను వెంబడిస్తున్న శునకాలు
- శునకాల బెడదను వెంటనే అరికట్టాలి
- వృద్ధులు, పిల్లలు, మహిళలపై శునకాల దాడులు
- పట్టించుకోని పాలన వర్గం



రోడ్డుపై సంచరిస్తున్న శునకాలు (ఫైల్)



వీధుల్లో సంచరిస్తున్న శునకాలు (ఫైల్)

రుద్రూరు, జూన్ 30: మనుషులతో అత్యం త సన్నిహితంగా మెలిగే జంతువులలో శునకాలు ముఖ్యమైనవి. ఇతరపెంపుడు జంతువుల కంటే కుక్కల ద్వారా మనుషులకు వచ్చే వ్యాధులు ఎక్కువ. పిచ్చి కుక్కలు, వీధి కుక్కల ద్వారానే గాక పెంపు కుక్కల ద్వారా కూడా వ్యాధులు వ్యాపించే ప్రమాదం చోటు చేసుకుంటున్నాయి. కుక్కకాటు వల్ల రేబీస్ అనే వ్యాధి వస్తుందనే విషయం తెలిసిందే. కుక్కలోని లాలాజలంలో ఉండే రేబిస్ క్రిముల వల్ల రేబిస్ వ్యాధి సోకు తుంది. నిత్యం ఏదో ఒక చోట పశువులు, మ నుషులపై, వాహనదారులపై, మహిళలు, చిన్నా రులపై దాడులు జరుగుతున్న సంఘటనల్లో గా యాలు కావడం, చనిపో వడం వంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. రుద్రూరు మండల కేంద్రంలోని పలు వీధులలో శునకాల బెడద రోజురోజుకు పెరిగి పోతోంది. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్రంగా ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. ము ఖ్యంగా రుద్రూరు కేంద్రంలోని అంబేద్కర్ కాలనీ, జవహర్‌నగర్ కాలనీ, కుమ్మరి వీధి, కర్రోళ్ల వీధి, అంగడి బజార్ తదితర పలు వీధులలో శునకాలు స్వైర విహారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. అంబేద్కర్ కాలనీ, జవహర్‌నగర్ కాలనీలలో నడిరోడ్డుపై, పలు వీధులలో శునకాలు గుంపుల గుంపులుగా తిరుగుతూ సంచరిస్తున్నాయి. దీంతో మహిళలు, చిన్నారులు, స్థానిక వాసులు బయటకు వెళ్లాలంటే శునకాలు ఎప్పుడు దాడి చేస్తాయో తెలియక భయభ్రాంతులకు గురవుతు న్నారు. బోధన్- బాన్సువాడకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో నిత్యం ప్రధాన రహదారి గుండా వేలాది వాహనాలు వెళుతుంటాయి. అటుగా వెళు తున్న ద్విచక్ర వాహనదారులపై, పాదాచారులపై శునకాలు దాడి చేస్తున్నాయని స్థానికులు, మహిళలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రోడ్డుపై వెళుతున్న పలు వాహనాలను, ద్విచక్ర వాహన దారులను శునకాలు వెంబడిస్తూ ఇబ్బం దులకు గురి చేస్తున్నాయన్నారు. ఈక్రమంలో ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి ప్రమాదా లకు గురై గాయాలపాలైన సంఘటనలు ఎన్నో చో టు చేసుకుంటున్నాయి. అంతేగాక రోడ్డుపై వివిధ పనుల నిమిత్తం నడుచుకుంటూ వెళుతున్న మహి ళలపై, పెద్దలపై, చిన్నారులపై సైతం దాడి చేస్తున్నాయని స్థానికులు పేర్కొం టున్నారు. ముఖ్యంగా ఉదయం,రాత్రి వేళల్లో శునకాలు వాహనదారులను, పాదాచా రులను వెంబడిస్తున్నాయని స్థానిక వాసులు తెలియజేస్తున్నారు. వెంటనే సంబంధిత అధి కారులు చర్యలు తీసుకుని శునకాల బెడద అరికట్టాలని ప్రజలు, కాలనీల వాసులు కోరుతున్నారు.

శునకాల బెడదను అరికట్టాలి



శునకాల వల్ల స్థానికులు, వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. రోడ్డుపై వెళ్లే వారిని వెంబడిస్తూ దాడికి పాల్పడుతున్నాయి. రాత్రివేళల్లో, ఉదయం పూట వాహన దారులను వెంబడిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. వెంటనే శునకాల బెడదను అరికట్టాలి.

\- పి.కిరణ్, అంగడి బజార్, రుద్రూరు

ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిపై దాడి చేస్తున్నాయి



జవహర్‌నగర్‌లో బాన్సువాడ - బోధన్ వెళ్లే ప్రధాన రహదారి కావడంతో అటుగా వెళ్లే ద్విచక్ర వాహనదారులను వెంబడిస్తున్నాయి. ఆ క్రమంలో వాహన దారులు అదుపు తప్పి ప్రమాదాలకు గురై గాయాలపాలవు తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసు కోవాలి.

-నవీన్, జవహర్‌నగర్ కాలనీ, రుద్రూరు

సుంకెట్‌లో గ్రామదేవతలకు జలాభిషేకం



గ్రామదేవతలకు గోదావరి జలాలతో జలాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

మోర్తాడ్, జూన్30: మోర్తాడ్ మండలం సుంకెట్ గ్రామంలో వర్షాలు కురిసిన చెరువుల నిండాలని గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామంలోని గ్రామదేవతలకు జలాభిషేకం చేశారు. ఉదయం గోదావరి నది నుంచి తెచ్చిన జలాలతో వలగొడుగుతో మహిళల బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలోని దేవత మూర్తులకు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పోతరాజుల విన్యాసాలు గ్రామస్థులను అలరించాయి. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు సందీప్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● ఉప్లూర్‌లో వీడీసీ ఆధ్వర్యంలో వలగొడుగు ఉత్సవం

కమ్మర్‌పల్లి: మండంలోని ఉప్లూర్ గ్రామంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం వలగోడుగు ఉత్సావాన్ని ఘనంగానిర్వహించారు. పవిత్ర గోదావరి నుంచి గంగాజాలను తెచ్చి స్థానిక బాలరాజరాజేశ్వరస్వామి ఆలయ నుంచి వలగొడుగు ఊరేగింపు నిర్వహించారు.వర్షాలు కురవాలని అంతసుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ గ్రామదేవతలకు డప్పువాయిద్యాలతో వెల్లి నైవేద్యాలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామకమిటీ అధ్యక్షుడు సోమ దశరత్, సభ్యులు చింత కుంట శ్రీనివాస్, కొమ్ముల రవీందర్, బద్దం రమేష్, నరేందర్ తదతర కమిటీ సభ్యులతో పాటు గ్రామస్తులు గ్రామ గంగపుత్ర సంఘాల స భ్యులు పాల్గొన్నారు.

● మెండోరలో గ్రామదేవతలకు జలాభిషేకం

మెండోర: వానమ్మ వానమ్మ ఒక్కసారైనా వచ్చి పోవమ్మా అంటూ.. మండలంలో గ్రామప్రజలు పవిత్ర పుణ్యక్షేత్రం గోదావరి నది నుంచి కాలినడకన వెళ్లి డప్పువాయిద్యాలతో వలగొడుగు, మహిళల మంగళహారతులతో, శివ సత్తుల పునాకలు, పోతారాజుల విన్యాసాలతో గంగజలాలను తీసుకువచ్చి గ్రామదేవతలకు జలాభిషేకం నిర్వహించారు.

● ఘనంగా పస్కారాజుల పండగ

ముప్కాల్: ముప్కాల్, బాల్కొండ మండలాల్లోని ఆయా గ్రామాల్లో పస్కారాజుల పండగను గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గోదావరి తీరం నుంచి గంగజలాలను తీసుకువచ్చి వలగొడుగులు, డప్పువాయిద్యాలు, మహిళ మంగళహారతులతో ఊరేగింపుగా వెళ్లి ఆలయాల్లో పూజలు నిర్వహించి దేవతమూర్తులకు జలా భిషేకం చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని, ప్రజలం దరు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ పూజలు చేశారు.ఈకార్యక్ర మంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.

● ఆలూర్‌లో...

ఆర్మూర్‌రూరల్: ఆలూర్ మండల కేంద్రంలోని గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం దేవతమూర్తులకు జలాభిషేకం నిర్వహిం చారు. గోదావరి తీరం నుంచి గంగజలాలను తీసుకువచ్చి వలగొడుగులు, డప్పువాయిద్యాలు, మహిళ మంగళహారతులతో ఊరేగింపుగా వెళ్లి ఆలయాల్లో పూజలు నిర్వహించి దేవతమూర్తులకు జలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వీడీసీసభ్యులు గంగాధర్, మధు, శేఖర్, వినోద్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్, తదితరులు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్‌లో మరమ్మతులు



సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,జూన్30: శనివారంరాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి బోధన్ సబ్ స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌లు మరమ్మత్తులు చేపట్టినట్లు ట్రాన్స్‌కో డీఈ ముక్తార్ తెలిపారు. వర్షానికి ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు వస్తున్నాయన్నారు. అప్పుడప్పులు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు. ప్రజలకు నిరంతరం విద్యుత్ అందించడం కోసం ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపడుతున్నామన్నారు. రైతులకు, ప్రజలకు విద్యుత్ సమస్యలు ఎదురైతే వెంటనే తమ సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. నిరంతరం విద్యుత్ అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు.

డబుల్ బెడ్ ఇళ్లు అందజేయాలని ఆందోళన



కందకుర్తిలో ఆందోళన చేస్తున్న ప్రజలు

రెంజల్,జూన్30: అర్హులైన వారందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అందించాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వం ఇళ్లు నిర్మించిన నేటి వరకు మండలంలోని కందకుర్తి గ్రామంలో లబ్ధిదారులకు అందించడం లేదంటూ ఆదివారం గ్రామస్థులు డబుల్ బెడ్ రూమ్ వద్ద ఆందోళన చేపట్టారు. ఎవరికి వారుగా ఇళ్లలోకి చొరబడడంతో గుర్తించిన పంచాయతీ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి ఎస్‌ఐ సాయన్న డబుల్ బెడ్ రూమ్‌ల వద్దకు వచ్చి ప్రజలకు నచ్చజెప్పడంతో గ్రామస్థులు వెనుదిరిగారు. తమకు ఏళ్ల నుండి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తామని చెప్పి నేటి వరకు ఇవ్వకపోవడంతో నివాస గృహలు లేక ఇబ్బందులు పడుతున్న అధికారులు, ప్రభుత్వం స్పందించి డబుల్ బెడ్ రూమ్‌లను పంపిణీ చేసి లబ్ధిదారులను ఆదుకోవాలన్నారు.

ఏర్గట్లలో ధర్మపురి శ్రీనివాస్‌కు నివాళి



ఏర్గట్లలో శ్రీనివాస్ నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఏర్గట్ల, జూన్ 30: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఆదివారం కాంగ్రెస్ పార్టీ మాజీ పీసిసి అధ్యక్షుడు, మాజీ మంత్రివర్యులు ధర్మపురి శ్రీనివాస్ మృతి పట్ల కాంగ్రెస్ నాయకులు ఆయనకు ఘన నివాళి అర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, కురాకుల భూమన్న, బద్దం లింగారెడ్డి, ముస్కు మోహన్, పన్నాల నర్సారెడ్డి, గడ్డం జీవన్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్గుల్‌లో ఘనంగా తాతాయి పండుగ

జక్రాన్‌పల్లి, జూన్ 30: వర్షాలు కురిసి పంటలు పండాలని మండలంలోని అర్గుల్ గ్రామంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం తాతయి పండగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి గ్రామస్థులు, భక్తులు తాతయి ఆలయానికి చేరుకున్నాయి. అనంతరం ఆలయంలో తాతయికి భక్తులు, గ్రామస్థులు నైవేద్యాలు వేసి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామస్థులు వనభోజనాలకు వెళ్లారు. ఈ కార్యక్ర మంలో అర్గుల్ వీడీసీచైర్మన్ మధుసూదన్‌రెడ్డి, క్యాషియర్ అల్లూరి బాస్కర్‌రెడ్డి, వీడీసీభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రెండు లారీలు ఢీకొని డ్రైవర్‌కు గాయాలు

జక్రాన్‌పల్లి, జూన్ 30: మండలంలోని అర్గుల్ గ్రామంలో 44వ జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం రెండు లారీలు ఢీకొనగా ఒక లారీ డ్రైవర్‌కు గాయాలైనట్టు పోలీసులు తెలిపారు. హైదరాబాద్ నుంచి ఆర్మూర్ వైపు వెళ్తున్న రెండు లారీలు వెనుక నుంచి వచ్చి మరో లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒక లారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలు కాగా 108అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపారు.

మద్యం సిండికేట్ దందా

- స్టిక్కర్ల బెల్టు షాపులకు సరఫరా
- ఒక్కో మద్యం బాటిల్, బీరుపై రూ.20 దౌర్జన్యపు వసూళ్లు
- గ్రామ కమిటీలు, ఎక్సైజ్ సిబ్బంది చేతివాటం

వర్ని,జూన్30: బోధన్ ఎక్సైజ్ శాఖ పరిధిలోని వర్ని ఉమ్మడి మండలంలో మద్యం మాఫియా కొత్త పుంతలు తొక్కుతోంది. ధనార్జనే ధ్యేయంగా మద్యం వ్యాపారులు సిండికేట్‌గా మారి గ్రామాల్లో పుట్ట గొడుగుల్లా బెల్టు షాపులు ఏర్పడటానికి కారణం అవుతున్నారు. ఏ షాపు పరిధిలో గల బెల్టు షాపుకు ఆ షాపు స్టిక్కర్ ముద్రణ వేస్తూ గ్రామాలకు పెద్ద మొత్తంలో మద్యం సరఫరా యదేచ్ఛగా కొనసాగుతోంది. వ్యాపారులు ఎక్సైజ్ అధికారులను మచ్చిక చేసుకుని దందా కొనసాగిస్తుండగా బెల్టు షాపు నిర్వాహకులు గ్రామ కమిటీలకు ఏడాదికి ఒక్కో బెల్టు షాపుకు రూ.25వేల నుంచి రూ.1.50లక్షల వరకు డిమాండ్ పద్దతిలో చెల్లిస్తున్నారు. వర్ని, రుద్రూర్, చందూర్, మోస్రా మండలాల పరిధిలో సుమారు 90వరకు బెల్టు షాపులు ఉండగా 20వరకు దాబాలు కొనసాగుతున్నాయి. దాబా నిర్వాహకులు మద్యం ఎమ్మార్పీపై రూ.30అదనపు వసూళ్లు చేస్తుండగా సిట్టింగ్, మటన్, చికెన్, భోజనం వంటకాలతో ఒక్కో మద్యం ప్రియుడిపై రూ.750 వరకు దండుకుంటున్న సందర్భాలు ఉన్నాయి. ఇక బెల్టు షాపుల్లో ఒక్కో క్వాటర్, బీరు సీసాపై రూ.20వరకు సొమ్ము చేసుకుంటున్నారు. విచ్చల విడిగా బెల్టు షాపుల వల్ల నిత్యం గ్రామాల్లో దొంగతనాలు, విచ్చలవిడి జూదం, హత్యలు, అత్యాచారాల సంఖ్య పెరిగిపోతోంది. యువత మద్యానికి బానిసై చెడు అలవాట్లకు గురవుతున్న సందర్భాలు ఉన్నాయి. నేరాల సంఖ్య పెరగడంతో వాటి నియంత్రణలో ఎక్సైజ్ శాఖదే బాధ్యతగా పేర్కొంటూ పోలీసులు చేతులెత్తేస్తున్న సందర్భాలు కోకొల్లలు. మద్యం మహమ్మారి వల్ల గ్రామాల్లో శాంతిభద్రతల సమస్య తీవ్రం అవుతున్న ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్, గ్రామ కమిటీల సహకారం మరింత అనర్థాలకు దారి తీస్తోంది అనడంతో సందేహం లేదు.



హత్యకు గురైన నారాయణ(ఫైల్)

ఎక్సైజ్ వారి పేరు చెప్పుకుంటే కటకటాలే: బోధన్ ఎక్సైజ్ సీఐ

గ్రామాలు, మండల కేంద్రాల్లో విచ్చలవిడి బెల్టు షాపులు, దాబాలు పెరగడంపై బోధన్ ఎక్సైజ్ సీఐ పవన్ గౌడ్‌ను వివరణ కోరగా ఆయన ఘాటుగా స్పందించారు. మద్యం వ్యాపారుల సిండికేట్ గ్రామ కమిటీల వారి బెల్టు షాపు నిర్వాహకుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేయడం, జూదం, హత్యలు, అత్యాచారాలు దొంగతనాల సంఖ్య పెరగడంలో ఎక్సైజ్ శాఖపై ఆరోపణలు వస్తున్నాయి అని ప్రశ్నించగా తనకెలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. ఇక నుంచి బోధన్ డివిజన్ పరిధిలో అక్రమ మద్యం అమ్మకాలపై నిఘా పెంచి దాడులు నిర్వహిస్తామని తెలిపారు. బెల్టు షాపు నిర్వాహకులు, దాబా నిర్వాహకులు తమ శాఖ పేరు చెప్పి అక్రమ దందాలు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి కటకటాల పాలు చేస్తామని హెచ్చరించారు. అక్రమ మద్యం అమ్మకాలపై తమకు సమాచారం ఇవ్వాలని వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని సీఐ కోరారు.

దండోరా రజతోత్సవ వేడుకలు విజయవంతం చేయాలి

బోధన్‌రూరల్,జూన్30: దండోరా రజతోత్సవ వేడుకలు విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు విద్యాసాగర్ అన్నారు. ఆదివారం సాలూర మండల కేంద్రంలోని జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో దండోర రజతోత్సవ వేడుకల కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి 30సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జులై 7వ తేదిన హైదరాబాద్ రవీంద్ర భారతిలో రజతోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించబడుతుందన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హజరుకానున్నారన్నారు. జిల్లాలోని అన్ని మండలాల ఎమ్మార్పీఎస్ మాదిగ, మాదిగ ఉప కులాల హజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు లింబూరి లక్ష్మణ్, మందర్నా నాగురావు,తదితరులు పాల్గొన్నారు.

పెర్కిట్ సొసైటీ మహాజన సభలో రసాభాస

ఆర్మూర్‌రూరల్, జూన్30: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ సొసైటీ ఆవరణలో ఆదివారం జరిగిన మహాజన సభ రసభసగా మారింది. మహాజన సభలో పలువురు రైతులు ఎరువులు సకాలంలో ఇవ్వడంలేదని సొసైటీ చైర్మన్ పెంట బోజారెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ఇతర గ్రామాలకు వెళ్ళి ఎరువులు తీసుకురావాల్సిన అవసరం ఉందని వారన్నారు. ఇందుకు కారణమైన సొసైటీ చైర్మన్, డైరెక్టర్‌లు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పెర్కిట్ సొసైటీ వల్ల రైతులకు ఏలాంటి లాభం లేదని, పాలకవర్గ సభ్యులు మాత్రం లబ్ధిపొందుతున్నారని వారు ఆరోపించారు. ఈ సందర్భంగా సొసైటీ డైరెక్టర్‌లకు రైతుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. సొసైటీలో అవినీతి రాజ్యమేలుతుందని చైర్మన్, డైరెక్టర్‌లు రైతుల సమస్యలను పట్టించుకోవడంలేదని వారో ఆరోపించారు. డైరెక్టర్‌లు, రైతులు ఒకరినోకరు దుషించే స్థాయికి వెల్లగా అధికారులు కలగజేసుకొని ఇరువర్గాలకు నచ్చజెప్పారు. అనంతరం ప్రత్యేక అధికారి శ్రీరాం మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు బంధు పథకంపై రైతుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నామని, సొసైటీల నుంచి సేకరించిన అభిప్రాయాలను చేసిన తీర్మాణాలను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు, రైతు బంధు ఇవ్వవద్దవని, ఐదు ఎకరాల లోపు రైతులకు మాత్రమే రైతు బంధు అందజేయాలని రైతులు అభిప్రాయపడ్డారు. పంటలు పండించే రైతులకు మాత్రమే రైతు బంధు ఇవ్వాలని సమావేశంలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్, రైతులు పాల్గొన్నారు.



పెర్కిట్‌లో సొసైటీ డైరెక్టర్‌లు, రైతుల మధ్య వాగ్వాదం

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు



మొక్కలను నాటుతున్న బీజేపీ అధ్యక్షుడు

రుద్రూరు, జూన్ 30 : రాష్ట్ర శాఖ పార్టీ ఆదేశాల మేరకు ఆదివారం భారతీయ జనతా పార్టీ రుద్రూరు మండల శాఖ ఆధ్వర్యంలో భారతీయ జన్‌సంఘ్ స్థాపకులు బీజేపీ డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి ఉత్సవాల సందర్భంగా ఆదివారం ఏక్‌పెడ్-మా కానామ్-అమ్మ పేరిట ఒక మొక్క కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నాయకులు. కార్యకర్తలు తమ తమ గ్రామాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేప ట్టారు. రుద్రూరు మండలంలోని సిద్దాపూర్ గ్రా మంలో తన ఇంటి ఆవరణలో బీజేపీ అధ్య క్షు డు అలపాటి హరికృష్ణ మొక్కలను నాటారు.

● మోదీ మన్‌కీ బాత్‌ను వీక్షించిన బీజేపీ మండల అధ్యక్షుడు

రుద్రూరు మండల బీజేపీ అధ్యక్షులు అలపాటి హరికృష్ణ ఆదివారం తన స్వగృహం లో ప్రధానిమోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని కుటుంబ సభ్యులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వాయిదా పడిన మన్‌కీ బాత్ కార్యక్రమం తిరిగి ప్రారంభించడం సంతోషకరమని అన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ

● మహిళకు తీవ్ర గాయాలు

బోధన్‌రూరల్,జూన్30: బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ చౌరస్తాలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ధ్యాకం గల్లీకి చెందిన లక్ష్మి అనే మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. ఓ ద్విచక్ర వాహనదారుడు అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి మహిళను ఢీకొట్టి వెళ్లిపోయాడని స్థానికులు తెలిపారు. ఆమె రెండు కాళ్లపై నుండి ద్విచక్ర వాహనం వెళ్లడంతో తీవ్ర గాయలయ్యాయి. స్థానికులు 108 కు సమాచారం అందించి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

ఉప్లూర్‌లో పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



పూర్వసమ్మేళనంలో ఉప్లూర్ పాఠశాల పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

కమ్మర్‌పల్లి, జూన్ 30:మండలంలో ఉప్లూర్‌ఉన్నత పాఠశాలకు చెందిన 2008-09 విద్యాసంవత్సర పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు 16 సంవత్సరాల తరువాత ఒక చోట కలుసుకుని గెట్టుగెదరు కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాలలో వివిధ వృత్తులు, వ్యాపారాలు, ఉద్యోగులుగా స్థిరపడిన పూర్వ విద్యార్థులు, విద్యార్థినిలు ఆదివారం ఒక చోట కలుసుకున్నవీరు ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుంటూ తమతమ యోగక్షేమాలు, ప్రస్తుత వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాతజ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్దులు నేర్పిన ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువలు, జ్ఞాపికలతో సన్మానించుకుని వారి ఆశీర్వాదాలు అందుకున్నారు. అంతకు ముందు తాము చదివిన పాఠశాలకు వెళ్లి తరగతగదిలో కూర్చొని విద్యార్థి దశలో చేసిన తీపిగుర్తులను గుర్తు చేసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసి రోజంతా ఆనందడోలికల్లో మునిగి తేలారు. పూర్వ విద్యార్థి అపూర్వ సమ్మేళనంలో అప్పటి ప్రధానోపాధ్యాయులు చంద్రమోహన్, ఉపాధ్యాయులు శంకర్‌గౌడ్, వేణుగోపాల్ శర్మ, విజయ్‌కుమార్, ఊట్నూర్ గంగాధర్, శిరిమల్ల దేవన్న,మంద శ్రీనివాస్, ఆదిత్య, సంధ్యారాణి, పూర్వవిద్యార్థినులు విద్యార్థులు తమతమ కుటుంబసభ్యులతో పాల్గొన్నారు.

బోధన్‌లో వర్షం.. రైతన్నల హర్షం

బోధన్‌రూరల్,జూన్30: బోధన్‌లో రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు పంట పొలాల పనులు జోరుగా కొనసాగుతున్నాయి. గ్రామాల్లోని చెరువులు, కుంటల్లోకి నీరు చేరుకుంటుంది. చిన్నపాటిగా కురుస్తున్న వర్షాలకు రైతన్న హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ వర్షాల తమ పంట పొలాలకు మేలు జరుగుతుందని హర్షం వ్యక్తం చేశారు. పొలం పనులు జోరందుకొనున్నాయి.

అనుమానాస్పదంగా ఒకరి మృతి



రవికుమార్ (ఫైల్)

ఆర్మూర్‌టౌన్,జూన్30: పట్టణంలోని జిరాయత్‌నగర్‌లో బండ రవికుమార్ (37)అనే వ్యక్తిఅనుమా నాస్పదంగా మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలి పారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం శనివారం రాత్రి బంధుమిత్రులతో కలిసి మద్యం సేవించాడని తెలిసింది. ఆదివారం ఉదయం ఓషాప్ వద్ద రవి కుమార్ అనుమానాస్పదంగా మృతి చెందడంతో స్థానికులు,కుటుంబస భ్యులు అయోమయానికి గురయ్యారు. దీంతో మృతుని భార్య స్థానిక పోలీస్ స్టేషన్‌లో అనుమానాస్పద మృతిగా ఫిర్యాదు చేసినట్టు తెలిసింది.సంఘటన స్థలాన్నిపోలీసులు పరిశీలించి మృతదేహాన్నిపోస్టు మార్టం ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. మృతునికి ముగ్గురు కుమారులు ఉన్నారు.

గుంతల మయంగా రోడ్డు



భీమ్‌గల్ నుంచి బెజ్జోరకు వెళ్లే బైపాస్ రోడ్డు దుస్థితి

భీమ్‌గల్ రూరల్, జూన్30: చిన్నపాటి వర్షానికే రోడ్లన్ని చిత్తడవుతున్నాయి. గుంతమయం అయిన రోడ్లతో జనాలు నానాఅవస్థలు పడుతున్నారు. ఇందుకు ఉదహరణే భీమ్‌గల్ నుంచి బెజ్జోర గ్రామానికి వెళ్లే ప్రధాన బైపాస్ రహదారి దుస్థితి. నిత్యం ఈ బైపాస్ రోడ్డు వెంబడి ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. వాహనాలు వందల సంఖ్యలో తిరుగుతాయి. ఈ తారురోడ్డు పూర్తిగా చెడిపోయి గుంతలమయం కావడంతో రాకపోకలు ఇబ్బందికరంగా మారాయి. ఇప్పటి వరకు గుంతలు పడ్డ రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టక పోవడంతో వర్షపు నీరు నిలిచి రాత్రిళ్లు వాహనాలు వెళితే ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్ బి శాఖ అధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

అద్దె గదుల్లో రూరల్ కార్యాలయాలు

● కిరాయి ఇంట్లో రూరల్ పీఎస్ ● అద్దె గదిలో రూరల్ తహశీల్ కార్యాలయం ● శిథిలావస్థ క్వార్టర్‌లో రూరల్ ఎంపీడీవో కార్యాలయం

నిజామాబాద్ రూరల్, జూన్30: జిల్లా కేంద్రానికి సమీపంలోనే ఉన్నా ఆ మండలానికి స్వంత భవనాలు కరువయ్యాయి. మండలం ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్నా ఇప్పటివరకు సొంత గూడు లేదు. నిజామాబాద్ జిల్లా పేరుతో ఉన్న మండలమే నిజామాబాద్ రూరల్ మండలం. ఈ మండలంలో ఒకప్పుడు 33 గ్రామాలుండేవి. ఇందులోంచి మోపాల్ మండలాన్ని ప్రత్యేకంగా ఏర్పాటుచేసి దాదాపు పదేళ్లపైనే అయింది. అయినా ఇప్పటికీ నిజామాబాద్ రూరల్, మోపాల్ మండలాలకు సంబంధించి ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఇప్పటికి మూడు ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చినా శాశ్వత ప్రభుత్వ భవనాలు ఏర్పాటుపై దృష్టిసారించలేదు. దాంతో మండల ప్రజలు తమ పనుల కోసం వచ్చేవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

● అద్దె గదుల్లోనే..

నిజామాబాద్ తహశీల్దార్ కార్యాలయం కొన్నేళ్లుగా పాత కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ పీడబ్ల్యుడి క్వార్టర్‌లో కొనసాగింది. ఎంపీడీవో కార్యాలయం సైతం దాని సమీపంలోనే ఉండేది. ఉపాదిహామీ పథకం భవనం కూడా అక్కడే ఉండేది. బీఆర్‌ఎస్ సర్కారు ఆ భవనాలను కూల్చివేయడంతో రూరల్ ప్రభుత్వ కార్యాలయాలు చెట్టుకు పుట్టకో విసిరివేయబడ్డాయి. దాంతో అద్దె గదుల్లోనే కార్యకలాపాలు నిర్వహించే దుస్థితి ఏర్పడింది

● ముబారక్‌నగర్‌లో తహసీల్దార్ కార్యాలయం...

ముబారక్‌నగర్‌లోని లక్ష్మిప్రియ నగర్ కాలనీలోని ఓ అపార్టుమెంట్‌లో మొదటి అంతస్థులో రూరల్ రెవెన్యూ కార్యాలయం ఏర్పాటుచేసుకున్నారు. దీనికి ప్రతీనెల అద్దె చెల్లిస్తున్నారు.



అద్దె క్వార్టర్‌లో రూరల్ పోలీసుస్టేషన్

● పోలీసు స్టేషన్..

కంఠేశ్వర్‌లో ఉండే రూరల్ పోలీసు స్టేషన్ శిథిలావస్థలకు చేరడంతో అక్కడ నూతన భవనం నిర్మానం సాగుతోంది. దీంతో ఐదేళ్ల క్రితం కంఠేశ్వర్ న్యూ హౌజింగ్‌బోర్డు కాలనీలోని కేసీఆర్‌కాలనీలో ఓ క్వార్టర్‌లో అద్దెకు తీసుకుని పోలీసుస్టేషన్ నిర్వహిస్తున్నారు. కేవలం రెండు గదుల గదులున్న క్వార్టర్‌లో రూరల్ పోలీసు స్టేషన్ నిర్వహిస్తున్నారు. ఇటీవల లక్ష రూపాయలు ఖర్చుచేసి స్వల్ప మరమ్మతులు చేపట్టారు. స్వాధీనం చేసుకున్న వాహనాలు పార్కుచేసే స్థలం లేక స్టేషన్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలోనే వాహనాలు పార్కుచేశారు. వాటికి రక్షణ లేక వాహనాలు తరచూ దొంగతనాలకు గురవుతున్నాయి.



అద్దె భవనంలో తహసీల్దార్ కార్యాలయం

● శిథిల గదుల్లోనే ఎంపీడీవో కార్యాలయం

జిల్లా పరిషత్ కార్యాలయం వెనుక భాగంలో ఉన్న పాత డీపీవో ఆఫీసునే రూరల్ మండల పరిషత్ కార్యాలయంగా మార్చుకున్నారు. క్వార్టర్ మొత్తం శిథిలావస్థకు చేరుకుంది. భారీ వర్షానికి ఎప్పుడు కూలుతుందో తెలియని అయోమయ స్థితిలో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. అక్కడే ఉపాదిహామీ సిబ్బంది సైతం విధులు నిర్వహిస్తున్నారు.

● అందుబాటులో లేని కార్యాలయాలు..

రూరల్ మండలంలో 19 గ్రామపంచాయతీలున్నాయి. చక్రధర్‌నగర్‌నుంచి ముత్తకుంటవరకు. రాంనగర్ నుంచి జలాల్‌పూర్‌వరకు, అటు శ్రీనగర్‌నుంచి పాల్ద వరకు విశాలమైన మండలమిది. రూరల్ వాసులు తమ రెవెన్యూ పనుల కోసం ఓ మూలనున్న ముబారక్‌నగర్‌కు, మరోవైపున్న పోలీసు స్టేషన్‌కు, డ్వాక్రా సంఘం మహిళలు పాంగ్రాకు వెళ్లాల్సివస్తోంది. జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్నప్పటికీ ఈ మండలవాసులకు పనుల కోసం మాత్రం చుట్టూ తిరగాల్సి వస్తోందని వాపోతున్నారు.

పనులు సగంలోనే ఆపేశారు..



● జి.మహేష్‌కుమార్, రూరల్ ఎస్‌హెచ్‌వో

రూరల్ పోలీసు స్టేషన్ భవనం కంఠేశ్వర్‌లో నిర్మిస్తున్నారు. భవనం పూర్తయినా ఇంకా సగం పనులు మిగిలివున్నాయి. కాంట్రాక్టర్‌కు బిల్లులు రాక పనులు నిలిపివేశారు. దాంతో రెండు ఇరుకు గదుల్లోనే పోలీసు స్టషన్ నిర్వహిస్తున్నాం. కొత్త భవనం త్వరగా పూర్తిచేస్తే సౌకర్యంగా ఉంటుంది.

సొంత భవనం లేక అద్దెలోనే..



● అనిరుద్, రూరల్ తహశీల్దార్

రూరల్ తహశీల్దార్‌కార్యాలయానికి సరియైన స్థలం లేక ముబారక్‌నగర్‌లో కమర్షియల్ కాంప్లెక్స్‌లో అద్దెకు తీసుకున్నాం. అక్కడే విదులు నిర్వహిస్తున్నాం. రూరల్ ప్రజలు నగర శివారులోకి రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. స్వంత భవనం ఏర్పాటుచేస్తే అందరికీ వెసులుబాటు అవుతుంది.

భయం భయంగా ఉంటున్నాం..



● మధురిమ, రూరల్ ఎంపీడీవో

పాత ఎంపీడీవో భవనం కూల్చేస్తామంటే పాత డీపీవో కార్యాలయంలోకి తాత్కాలికంగా మారాం. క్వార్టర్ మొత్తం శిథిలావస్థలో ఉంది. పైనుంచి పెంకులు ఊడిపడుతున్నాయి. ఎప్పుడు కూలుతుందోనన్న భయంతోనే సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. పాములు, ఇతర కీటకాలు లోపలికి వస్తున్నాయి.



సీఎంకు స్వాగతం పలుకుతున్న రెవెన్యూ ఉద్యోగులు

సీఎంకు స్వాగతం పలికిన ఉద్యోగులు

నిజామాబాద్ అర్బన్, జూన్30: జిల్లాకు వచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి నూతన కలెక్టరేట్‌లోని హెలిప్యాడ్ వద్ద ఉద్యోగ సంఘాల నాయకులు ఆదివారం స్వాగతం పలికారు. రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమన్‌రెడ్డి, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్ తదితరులు సీఎంకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

'తప్పుడు కేసులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి'

పెద్దబజార్, జూన్ 30: తనపై తప్పుడు కేసులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని బీఎల్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్ కోరారు. ఆదివారం నగరంలోని బీఎల్‌ఎఫ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పోలీసుల తీరుతో తన 37 ఏళ్ల ప్రజాఉద్యమంలో జీవితంలో సంపాదించిన పేరు, గౌరవమర్యాదలను కోల్పోయేలా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తనపై పెట్టిన కేసు నమోదు ఎఫ్ఐఆర్ కాపీ ఫిర్యాదు వివరాలు ఇవ్వాలని కోరారు. మూడో టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్సై, వన్ టౌన్ సీఐలు తనను బలవంతంగా జీపులో ఎక్కించుకొని వన్‌టౌన్‌కు తీసుకెళ్లారని, తనను బెదరించి సంతకం చేయించుకున్నారని ఆరోపించారు. దీనిపై పోలీస్ కమిషనర్ స్పందించి వన్‌టౌన్ సీఐ, మూడో టౌన్ ఎస్సైలపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో బీఎల్‌ఎఫ్ నాయకులు రాజేందర్, శ్రీమాన్, తదితరులు పాల్గొన్నారు.

'రాజ్‌భవన్ ముట్టడిని విజయవంతం చేయాలి'

నిజామాబాద్ అర్బన్, జూన్ 30: నీట్, ఎన్‌టిఏను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించే రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్, ఏఐపీఎస్‌యు జిల్లా కార్యదర్శి అనిల్‌లు పిలుపునిచ్చారు. ఆదివారం ఎన్‌ఆర్ భవన్‌లో ఎన్‌ఎస్‌యుఐ, ఎస్‌ఎఫ్ఐ, పిడిఎస్‌యు, ఏఐపిఎస్‌యు, ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం నిర్వహించే రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమాన్ని నీట్ విద్యార్థులు, తల్లిదండ్రులు, మేధావివర్గం పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. దేశవ్యాప్తంగా నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీపై ఆందోళన చేస్తున్న కేంద్రం స్పందించకపోవడం దారుణమని సిబిఐ విచారణ పేరుతో ఇద్దరిని అరెస్టు చేసి తమ పని పూర్తయినట్లు చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో విఘ్నేష్, నరేందర్, అశూర్, మహిపాల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్న వారిని శిక్షించాలి



కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమి

ఇందల్వాయి, జూన్ 30: ఇందల్వాయి మండలంలోని గౌరారం పరిధిలోగల 180 సర్వే నెంబర్‌లో ప్రభుత్వ భూమిని కొందరు నాయకులు ఎమ్మెల్యే పేరు చెప్పి కబ్జా చేస్తున్నారని ఇలాంటి వారిని కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు కోరారు. సర్వే నెంబర్ 180లో 20 గుంటల భూమిని గతంలో డబుల్ బెడ్‌రూంల కోసం కేటాయించారని దానిని ప్రస్తుతం కొందరు నాయకులు కబ్జా చేస్తున్నారని అన్నారు. శనివారం ఆ భూమిలో జేసీబీల ద్వారా తవ్వకాలు చేపట్టారని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి కబ్జాకు గురవుతున్న భూమిని అడ్డుకొని కాపాడాలని కోరారు.

ఖిల్లా డిచ్‌పల్లిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

డిచ్‌పల్లి, జూన్30: 2011-12లో ప్రభుత్వ పాఠశాల ఖిల్లా డిచ్‌పల్లిలో విద్యాభ్యాసం చేసిన విద్యార్థులు ఆదివారం ఒకే దగ్గర కలుసుకొని ఆత్మీయ సమావేశం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వారికి చదువు చెప్పిన ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు సన్మానాలు చేశారు. చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు వారి కుటుంబ సభ్యులను పరిచయం చేసుకున్నారు. అనంతరం అందరు కలిసి ఐక్యంగా భోజనాలు చేశారు.



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వవిద్యార్థులు

'అర్హులైన వారికే రైతుభరోసా ఇవ్వాలి'



రైతుల అభిప్రాయాలను సేకరిస్తున్న అధికారులు

ఇందల్వాయి, జూన్ 30: అర్హులైన వారికి రైతుబంధు పథకం అమలు చేయాలని రైతులు కోరుతున్నారు. ఆదివారం ఇందల్వాయి పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతువేదికలో ఏర్పాటు చేసి అవగాహన సదస్సులో రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా డిసివో శ్రీనివాస్‌రావు రైతుభరోసా పథకంపై అన్నదాతల నుంచి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ పంటలు సాగు చేసే రైతులకు మాత్రమే రైతుభరోసా పథకాన్ని అమలు చేయాలని కొందరు 10 ఎకరాలలోపు రైతులకు పథకం అమలు చేయాలంటే మరికొంత మంది పంట పండే భూములకు 20 ఎకరాల వరకు అందించాలని కోరారు. అలాగే చిరు ఉద్యోగులకు పన్ను చెల్లింపుదారులకు కూడా రైతుభరోసా పథకం అందించాలని తెలిపారు. కేవలం సాగైన పంటలకు మాత్రమే పథకాన్ని అందిస్తూ బీడు భూములు, వెంచర్లకు రైతుభరోసా ఇవ్వవద్దని తెలిపారు. పంటల సాగుకు ముందే రైతు ఖాతాల్లో డబ్బు జమ చేయాలని సూచించారు. ఇలా అందించడం ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు, కూలీల అవసరాలకు డబ్బు ఉపయోగపడుతుందని తెలిపారు. సకాలంలో డబ్బులు అందకపోతే రైతులు అప్పులు చేయాల్సి వస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఎడిఎ రవికుమార్, ఇందల్వాయి సొసైటీ చైర్మన్ గోవర్దన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మారుతి, సొసైటీ డైరెక్టర్లు, ఎఐవో ప్రకాష్‌గౌడ్, సీఈవో రతన్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నగరంలో భారీ వర్షం

నిజామాబాద్ అర్బన్, జూన్ 30: నగరంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మేఘావృతమైన ఆకాశం సాయంత్రం ఒక్కసారిగా వర్షం కురిసింది. వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి వర్షం కోసం ఎదురు చూస్తున్న వారికి ఆదివారం కురిసిన వర్షం కొంత ఉపశమనాన్ని కలిగించింది. భారీ వర్షానికి నగరంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. పాత కలెక్టరేట్ చౌరస్తా, రైల్వేస్టేషన్ చౌరస్తా, రైల్వేకమాన్, తదితర ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. భారీ వర్షానికి నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలుకాలనీల్లో ఇళ్లలో నీరు వచ్చింది. వాహనదారులు, పాదచారులు వర్షంలో తడుస్తూ ఇబ్బందులు పడ్డారు. సుమారు గంటపాటు వర్షం కురిసింది.

డీఎస్ అంత్యక్రియల్లో పాల్గొన్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు

డిచ్‌పల్లి, జూన్ 30: పీసీసీ మాజీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ అంత్యక్రియల్లో మాజీ మంత్రి, సీనియర్ నాయకులు మండవ వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాటిపల్లి నగేశ్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు డీఎస్ పార్థివదేహానికి నివాళ్లు అర్పించారు. అంత్యక్రియల్లో డిచ్‌పల్లి మండల కాంగ్రెస్ నాయకులు అమృతపూర్‌గంగాధర్, షాంసన్, ధర్మగౌడ్, వాసుబాబు, పాల్గొన్నారు.

రైతుల అభిప్రాయాల మేరకే రైతు భరోసా: డీసీవో



మాట్లాడుతున్న డీసీవో శ్రీనివాసరావు

డిచ్‌పల్లి, జూన్ 30: రైతులకు రైతు భరోసాపై అవగాహన కలిగించేందుకు సహకార సంఘాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు చేపట్టిందని రైతుల సూచనల మేరకే భరోసాను కల్పిస్తుందని జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మండలంలోని రాంపూర్, మెంట్రాజ్‌పల్లి సహకార సంఘాల్లో జరిగిన అవగహన కార్యక్రమానికి డీసీవో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గుంట భూమి నుంచి 10 ఎకరాల వారికి రైతుభరోసా పథకం కల్పించాలని విండో చైర్మన్ తారచంద్ నాయక్ తెలిపారు. అనంతరం సందర్భంగా పీసీసీ మాజీ అధ్యక్షుడు డి.శ్రీనివాస్ మరణానికి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ న్యాస రాజేశ్వర్, మాజీ సర్పంచ్ గణేశ్, తిరుపతి, మాజీ ఎంపీటీసీ రవి, రైతులు పాల్గొన్నారు.

జిల్లావాసికి రాష్ట్రస్థాయి బాలసాహిత్య పురస్కారం



పురస్కారం అందుకుంటున్న నరేష్‌రావు

నిజామాబాద్ రూరల్, జూన్ 30: జిల్లాకు చెందిన ప్రముఖ కవి, బాలల సాహిత్యంపై రచనలు చేసిన డాక్టర్ కాసర్ల నరేష్‌రావుకు రాష్ట్రస్థాయి బాల సాహిత్య పురస్కారం లభించింది. ఆదివారం సిద్దిపేటలో శ్రీవాణి సాహిత్యపరిషత్, బాల సాహిత్యపీఠం నిర్వహించిన కార్యక్రమంలో బాలసాహిత్య పుర స్కారాన్ని డాక్టర్ కాసర్ల నరేష్‌రావు రచించిన బడిపిల్లల నాటికల సంపుటి "జై జవాన్" పుస్తకానికి ఈ పురస్కారం లభించింది. ఈ సభలో ప్రముఖ రచయితలు డాక్టర్ దాశరథుల బాలయ్య, రాంచంద్రరెడ్డి, ఐతా చంద్రయ్య, డాక్టర్ కొండల్ రెడ్డి, వాసరవేని, పరుషరాములు తదితరులు పాల్గొన్నారు.

టీయూలో విద్యార్థుల సంబరాలు

డిచ్‌పల్లి,జూన్ 30: టీ-20 వరల్డ్ కప్‌లో టీం ఇండియా విజయం సాధించడంతో తెలంగాణ యూనివర్సిటీలో విద్యార్థులు సంబరాలు జరుపుకున్నారు. మిఠాయిలు పంచుకొని టపాసులు పేల్చారు. విద్యార్థులు కేరింతలు కొడుతూ సంబరాలు నిర్వహించుకున్నారు. ఇండియ గెలువగానే భారతదేశ జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించి దేశానికి మద్దతుగా నినాదాలు చేశారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.150	రూ.280	రూ. 300
వెన్‌కాబ్(కిలో)	రూ.155	రూ.285	రూ. 305

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.72,900	రూ.67,200	రూ.920

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

- స్క్రీన్-1 : కల్కి (3డి తెలుగు) (5.50, 9.20, 12.50, 4.20, 7.50, 11.20)
- స్క్రీన్-2 : కల్కి (3డి తెలుగు) (6.10, 9.40, 3.30, 7.00, 10.30)
  : ఇన్‌సాడ్ ఔట్-2 (ఇంగ్లీష్ 3డి) (1.10)
- స్క్రీన్-3 : కల్కి (తెలుగు) (5.40, 9.10, 12.40, 7.10, 10.40)
  : మహారాజ (4.10)
- స్క్రీన్-4 : కల్కి (తెలుగు) (5.30, 9.00, 12.30)
  : ముంజియా (హిందీ) (4.00)
  : కల్కి (హిందీ) (6.45, 10.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

- స్క్రీన్-1 : కల్కి (తెలుగు) (3.10, 7.00, 10.40)
- స్క్రీన్-2 : కల్కి (తెలుగు) (10.30)
  : కల్కి (తెలుగు 3డి) (4.30, 10.15)
- స్క్రీన్-3 : కల్కి (తెలుగు) (1.30)
  : కల్కి (3డి తెలుగు) (7.25)

- దేవి : కల్కి (11.15, 2.15, 6.15, 9.15)
- నటరాజ్ : కల్కి (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
- విజయ్ : కల్కి (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్